# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 17, నవంబర్ 2025


## సీపీఐ వందేళ్ళ ఉత్సవాలను జయప్రదం చేయండి

**• పి. నర్సయ్య సేవలు మరువలేనివి • సీపీఐ జాతీయ నాయకులు చాడ వెంకట రెడ్డి**

నస్పూర్, నవంబర్ 16, ప్రభాతవార్త




వివరాలు 2లో...

మాట్లాడుతున్న సీపీఐ జాతీయ నాయకులు చాడ వెంకట రెడ్డి

# కాగజ్‌నగర్‌లో సైబర్ మోసం

**• రూ.76.50 లక్షల పెట్టుబడి మోసం బట్టబయలు**
**• సైబర్ మోసంలో ఇద్దరు అరెస్ట్**
**• వివరాలు వెల్లడించిన డీఎస్పీ వహిదుద్దీన్**

కాగజ్‌నగర్, నవంబర్ 16, ప్రభాతవార్త:

కాగజ్‌నగర్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న భారీ సైబర్ పెట్టుబడి మోసం కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. వాట్సాప్ ట్రేడింగ్ పేరుతో బాధితురాలి నుంచి రూ.76.50 లక్షలు దోచుకున్న గుంపులో మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వహిదుద్దిన్ తెలిపారు. ఆదివారం కాగజ్‌నగర్ టౌన్ పోలీస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. 2025 మే 22 జూన్ 17 మధ్య నిందితులు వాట్సాప్‌లో నకిలీ ట్రేడింగ్ గ్రూపులు సృష్టించి, అధిక లాభాలు వస్తాయని చెప్పి బాధితురాలిని నమ్మబలికారు. ఫేక్ లాభాల స్క్రీన్‌షాట్లు చూపించి వివిధ బ్యాంక్ ఖాతాల్లో మొత్తం రూ.76,50,000 జమ చేయించారు. అనంతరం గ్రూపులన్నింటినీ డిలీట్ చేసి గాయబ్ అయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు టౌన్ ఇన్‌స్పెక్టర్ కె. ప్రేమ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటికే రెండు అరెస్టులు జరగగా, వారి విచారణలో బయటపడిన వివరాల ఆధారంగా ఎ3,ఎ4లను గుర్తించి పూణే, అహ్మదాబాద్‌లలో అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. పూణేలో సంతోష్ తౌవర్ అరెస్ట్ ఎ3 సంతోష్ కుశాల్ చంద్ తౌవర్ (51) నకిలీ పేరుతో యాక్సిస్ బ్యాంక్ ఖాతా తెరవడంలో సహకరించినట్టు ఒప్పుకున్నాడు. బ్యాంక్ ఖాతాదారులతో ఉన్న పరిచయాల ప్రయోజనాన్ని తీసుకుని మోసగాళ్లకు మద్దతుగా పనిచేసినట్లు పోలీసులు తెలిపారు. అహ్మదాబాద్‌లో దవల్ పటేల్ పట్టుబాటు ఎ4 పటేల్ దవల్ కుమార్ గండాలాల్ (24) సోమనాథ్ ఎంటర్‌ప్రైజెస్ పేరిట నకిలీ పత్రాలు సృష్టించి,యాక్సిస్ బ్యాంక్,బంధన్ బ్యాంక్‌లో ఖాతాలు తెరిచి మోసాలకు ఉపయోగించినట్టు విచారణలో బయటపడింది. వీరి అరెస్టు కోసం ఎస్ఐలు సుధాకర్, ప్రశాంత్,యాదగిరి, సిబ్బంది సంపత్, నౌషాద్,రవిచంద్ర,పఠాన్ శమీనబీతో కూడిన బృందాలను పూణే,అహ్మదాబాద్‌లకు పంపినట్టు డీఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు.





## చిరుత సంచారం.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సారంగాపూర్, నవంబర్ 16, ప్రభాతవార్త:

మండలంలోని చించోలి (బి) గ్రామ పరిసర ప్రాంతాల్లో చిరుత సంచరిస్తున్నట్లు స్థానికులకు ఆందోళన కలిగించే సమాచారాన్ని సారంగాపూర్‌కు చెందిన పెద్దకాపు రాజారెడ్డి, ఓలత్ర ఆనంద్ రెడ్డి వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం నిర్మల్ నుంచి ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో గండి రామన్న హరితవనం సమీపంలో రోడ్డుపైకి ఒక్కసారిగా చిరుత రావడంతో వారు కారు నిలిపివ్వాల్సి వచ్చిందని తెలిపారు. అనంతరం చిరుత అడవివైపు పార్క్ దిశగా వెళ్లిపోయిందని చెప్పారు. శనివారం ఉదయం చించోలి (బి) గ్రామ శివారులో పశువులను మేపిస్తున్న పశువుల కాపరులకు కూడా చిరుత కనిపించినట్లు సమాచారం వచ్చింది. వెంటనే గ్రామస్థులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. ఈ విషయంపై అటవీశాఖ అధికారి నజీర్‌ఖాన్ మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా ఈ పరిసరాల్లో చిరుత సంచారం గమనించామని, ప్రజలు ముఖ్యంగా రాత్రి వేళలో అడవి ప్రాంతాలు, చెరువు దారులు, పంట పొలాల వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పశువుల కాపరులు, పరిసర గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పరిస్థితుల్లోనూ ఒంటరిగా వెళ్లరాదని సూచించారు.

## హిందూ సమాజ సంఘటనే దేశ అభ్యున్నతికి మార్గం

**• ఆర్ఎస్ఎస్ సహ ప్రాంత ప్రచార కల్వగురి ప్రభు కుమార్**



ఆసిఫాబాద్, నవంబర్ 16, ప్రభాతవార్త:

హిందూ సమాజాన్ని సంఘటితంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాల్సిన అవసరం ఉందని సహ ప్రాంత ప్రచారక్ కల్వ గురి ప్రభు కుమార్ అన్నారు. ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయం ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజ సేవ, ఐక్యత, సహాయక భావన వంటి అంశాలను ప్రధానంగా ఉంచుకుని రాష్ట్రీయ స్వయంసేవక సంఘ శతాబ్ది దిశగా చేపడుతున్న కార్యక్రమాలపై వివరించారు. సమాజంలోని ఆర్థిక, విద్యా, వైద్య వంటి పలు రంగాల్లో సేవలను అందిస్తూ ఆర్ఎస్ఎస్ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. స్వార్థాన్ని వదిలి ధర్మం, సమాజ రక్షణ కోసం పనిచేయడం ప్రతి హిందువుని ధర్మమని చెప్పారు. దేశంలో కొన్ని ప్రాంతాల్లో హిందువులపై హింసాత్మక చర్యలు జరుగుతున్నాయని, హిందువులను విడదీసే ప్రయత్నాలు, మత మార్పిడి చర్యలు, యువతను వ్యసనాలకు దారి తీసే కుట్రలు జరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సంఘటిత హిందూ సమాజమే ఈ దేశ అభివృద్ధికి మార్గం చూపగలదని, ప్రతి ఒక్కరూ ఈ మహోన్నత కార్యంలో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. అంతకుముందు జైన్ మందిర్ నుండి కుమ్రం భీం చౌక్ మీదుగా సాయిబాబా ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌతం చంద్ జైన్, కరింనగర్ విభాగ్ సహ కార్యవాహ మాదవరపు రంగస్వామి, మంచిర్యాల జిల్లా కార్యవాహ కృష్ణ భాస్కర్ జీ, డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, అరిగెల నాగేశ్వరరావు, అరిగెల మల్లికార్జున్, భోనగిరి సతీష్ బాబు, జనగామ ఖండ కార్యవాహ గుండేటి కోటేశ్వరరావు, డాక్టర్ వెంకటేష్, ఖండ కార్యకారిణీ సభ్యులు పాల్గొన్నారు.

## జిన్నింగ్ మిల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే

ఇచ్చోడ, నవంబర్ 16, ప్రభాతవార్త :

మండలంలోని ముక్ర గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన లక్ష్మి జిన్నింగ్ కాటన్ మిల్లును బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం మిల్లు యజమానులతో కలిసి యంత్రాల విభాగాలను సందర్శించి దూది శుద్ధి ప్రక్రియ, గింజలను వేరు చేసే విభాగం, ప్రాసెసింగ్ యూనిట్ల పనితీరును సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో రైతులకు మెరుగైన ధరలు వచ్చేలా ఇలాంటి మిల్లులు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, రైతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా పాలన ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, రైతులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



జిన్నింగ్ మిల్లును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



**రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు మృతి**

**మృతుడు కెకె5 గని మన్వే యాక్టింగ్ క్లర్క్**

2

**అమ్మవారిని దర్శించిన జిల్లా జడ్జి శ్రీవాణి**



## అమ్మవారిని దర్శించిన జిల్లా జడ్జి శ్రీవాణి

సారంగాపూర్, నవంబర్ 16, ప్రభాతవార్త:

మండలంలోని ప్రసిద్ధ శ్రీ మహా అడెల్లి పోచమ్మ, ఎల్లమ్మ ఆలయాలను జిల్లా జడ్జి శ్రీవాణి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాధిక, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ భవిష్య ఆదివారం సందర్శించారు. ఆలయ ప్రాంగణంలో అర్చకుల మార్గదర్శకత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అధికారులు, ఆలయ అర్చకులు, డైరెక్టర్ అందించిన సంప్రదాయ స్వాగతాన్ని స్వీకరించారు. ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా జడ్జి, కమిటీ సభ్యుల నుంచి పనుల పురోగతి, అవసరాలు, భవిష్య కార్యాచరణపై వివరాలు సేకరించారు. భక్తుల సౌకర్యాలను మెరుగుపరచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. తదుపరి స్వర్ణ ప్రాజెక్టును సందర్శించిన అధికారులు, ప్రాజెక్టు పరిసరాలలో జరుగుతున్న కార్యకలాపాలను సమీక్షించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు లింగా గౌడ్, ఎస్పై శ్రీకాంత్, గౌడ్ సంఘం సభ్యులు ప్రవీణ్ గౌడ్, రమేశ్ గౌడ్, శేఖర్ గౌడ్, చంద్రమోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రన్ ఫర్ బిసి సోషల్ జస్టిస్ విజయవంతం

### 42 శాతం రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలి బీసీ జేఏసీల డిమాండ్



మందమర్రి, నవంబర్ 16, ప్రభాతవార్త

మందమర్రి పట్టణంలోని సింగరేణి హై స్కూల్ అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం "రన్ ఫర్ బిసి సోషల్ జస్టిస్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి రన్‌ను ప్రారంభించిన అనంతరం మార్కెట్ కూడలి వరకు ఈ పరుగు కొనసాగింది. జాతీయ బీసీ సంక్షేమ సంఘం మందమర్రి పట్టణ కమిటీ అధ్యక్షుడు సకినాల శంకర్ ఆధ్వర్యంలో బీసీ బాంధవులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సకినాల శంకర్ మాట్లాడుతూ, బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు కావాలి. జనాభా నిష్పత్తి ప్రకారం రావలసిన హక్కుల కోసం న్యాయపోరాటం, రాజకీయ పోరాటం తప్పనిసరి. బీసీ ఉద్యమాన్ని అణగదొక్కేందుకు జరుగుతున్న కుతంత్రాలను ఎదుర్కోవడం ప్రతి బీసీ యువకుడి బాధ్యత అని తెలిపారు. అదే విధంగా బీసీ బిల్లుపై పార్లమెంటులో చర్చ చేపట్టాలని, ఇందుకోసం రాజ్యాంగ సవరణచేసి దాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపు మేరకు అష్టాంగ ఆందోళనల భాగంగా ఈ రన్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సోదరులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తూ, బీసీల ఐక్యశక్తితోనే న్యాయహక్కులు సాధ్యమవుతాయని శంకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మరియు పట్టణ స్థాయి పలువు బీసీ నాయకులు పాల్గొన్నారు. అందులో ప్రముఖులుగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నేరెళ్ల వెంకటేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి బత్తుల సతీష్ బాబు, ఉపాధ్యక్షులు దేవరపల్లి ప్రభాకర్, ఏదులపురం రాజు, ఎగ్జిక్యూటివ్ వర్కింగ్ ప్రెసిడెంట్ గట్ల సారంగపాణి, మద్ది వేణుగోపాల్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు జమాల్పూర్ నర్సోజి, మునిశెట్టి సత్యనారాయణ, పోలు సంపత్, మేడ గోని శంకర్, పోలు కుమార్, రాజలింగు, చింతల రమేష్, సిహెచ్. మహేందర్, మేడి రాజు, సముద్రాల శ్రీనివాస్, ఒడ్నాల ప్రభాకర్, ప్రసాద్, రజక సంఘం అధ్యక్షుడు రామ్ చందర్, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు మోహన్ తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదం లో సింగరేణి కార్మికుడు మృతి

### మృతుడు కెకె5 గని మన్వే యాక్టింగ్ క్లర్క్

మందమర్రి, నవంబర్ 16, ప్రభాతవార్త:

మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని బురదగూడెం జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి ఉద్యోగి తోట సతీష్ కుమార్ (59) మృతి చెందినట్లు మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. మృతుడు కెకె5 గనిలో మన్వే యాక్టింగ్ క్లర్క్ గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడు పని నిమిత్తం రోడ్డు దాటుతుండగా, బెల్లంపల్లి నుండి మంచిర్యాల వైపు వేగంగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సతీష్ కుమార్ సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. మృతుని అల్లుడు సాయి చరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది. ఇట్టి సంఘటన స్థలాన్ని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి పరిశీలించారు. ప్రయాణికులు జాతీయ రహదారులపై అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, పాదచారులు రోడ్డు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా పోలీసులు సూచించారు. మృతుడు సతీష్ కుమార్ కార్మికులు అందరితో కలిసిమెలిసి ఉంటారని తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సీపీఐ వందేళ్ళ ఉత్సవాలను జయప్రదం చేయండి

నస్పూర్, నవంబర్ 16, ప్రభాతవార్త

డిసెంబర్ 26న ఖమ్మంలో జరుగనున్న సీపీఐ వందేళ్ళ ఉత్సవాల బహిరంగ సభను అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని సీపీఐ జాతీయ నాయకులు చాడ వెంకట రెడ్డి కోరారు. శనివారం జోడేఘాట్‌లో ప్రారంభమైన బస్ జాత రెండవ రోజు శ్రీరాంపూర్ బస్టాండ్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ నాయకులు, చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం దేశ భక్తులమని ప్రజల్లో మత విద్వేషాలు రెచ్చగొడుతూ అధికారం కోసం అబద్ధపు మాటలు చెబుతూ కాలం వెళ్ళదీస్తుందని, కొంత మంది వ్యక్తులకు ఆస్తులను కూడబెట్టడం కోసం మాత్రమే నరేంద్ర మోడీ పని చేస్తున్నారని విమర్శించారు. దేశంలో కమ్యూనిస్టుల బలం సన్నగిల్లడం వల్ల మాత్రమే బిజెపి ఆటలు కొనసాగుతున్నాయని, నరేంద్ర మోడీ ప్రజల పక్షం కంటే సంపన్నుల పక్షమని తెలిపారు. నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు, ఉద్యమాలు, ప్రాణ త్యాగాలు చేస్తూ దేశంలో నిలకడగా నిలబడ్డ 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని తెలిపారు. సీపీఐ కార్యకర్తలు అధికారం కోసం ఏనాడు వెంపర్లాడలేదని, కమ్యూనిస్టులే నిజమైన దేశ భక్తులని, కార్మిక పక్షపాతి పువ్వాడ నర్సయ్య సేవలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్, ప్రజానాట్యమండలి పల్లె నరసింహ, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, నాయకులు మేకల దాసు, జోగుల మల్లయ్య, కారుకూరి నగేష్, లింగం రవి, బాజీ సైదా, మిరియాల రాజేశ్వర్ రావు, పూజారి రామన్న, కొత్తపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాల మహానాడు రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలిగా తిరుమల నియామకం

బెల్లంపల్లి, నవంబర్ 16, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా పట్టణంలోమాల మహానాడు జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో మాల మానాడు జాతీయ అధ్యక్షులు గడమండ్ల చెన్నయ్య ,రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు పాల్గొని మాల సంఘం బలోపేతంచేయడంలో భాగంగా బెల్లంపల్లి పట్టణానికి చెందిన మద్దెల తిరుమలను రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలిగా నియమించి నియామక పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలోమంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కుంభాల రాజేష్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్ట మధుకర్, రాష్ట్ర అధికార ప్రతినిధి భూపెల్లి మల్లయ్య, జాతీయ కార్యదర్శి దమ్ము నారాయణ తదితరులు పాల్గొన్నారు.



# ఐదు దశాబ్దాల ఆత్మీయ మహా సమ్మేళనం

### శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో విరిసిన ఆత్మీయ జ్ఞాపకాలు

మందమర్రి, నవంబర్ 16, ప్రభాతవార్త



మందమర్రి పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో 1972 నుంచి 2012 వరకు విద్యాభ్యసించిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రబంధకారిణిల సమక్షంలో ఐదు దశాబ్దాల ఆత్మీయ మహా సమ్మేళనం ఆదివారం విశేషంగా జరిగింది. ఉద్యోగ, వ్యాపార, ఉపాధి కారణాలతో దేశం నలుమూలలలో స్థిరపడిన బాల్యమిత్రులు చాలా కాలం తర్వాత ఒక వేదికపై కలుసుకుని పరస్పరం ఆహ్లాదంగా పలకరించుకున్నారు. చిన్ననాటి మధురస్మృతులను స్మరించుకుంటూ, జీవనానుభవాలను పంచుకుంటూ చిరునవ్వులతో ఆత్మీయ వాతావరణాన్ని నింపారు. ఈ కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమ విశిష్ట అతిథులు దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్ రెడ్డి, తెలంగాణ ప్రాంత సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు, విభాగ్ అధ్యక్షులు డాక్టర్ కె. విష్ణువర్ధన్ రావు తదితరులు మాట్లాడారు. వక్తలు మాట్లాడుతూ హిందూ సంస్కృతి-సాంప్రదాయాలు, భక్తి, మంచి ఆచారాలు, మర్యాద, గౌరవం వంటి విలువలను చిన్నప్పటి నుంచే బోధించడం ద్వారా సమాజంలో బృంద అవలోకనాన్ని పెంపొందించవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో మారిపోతున్న సామాజిక పరిస్థితుల్లో శిశుమందిర్ వంటి విద్యాసంస్థలు సంస్కారవంతులైన పౌరుల నిర్మాణంలో కీలక భూమిక పోషిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. దేశభక్తి, ధార్మికత, నైతిక విలువలను అందించే విద్య అత్యవసరమని, హింసావాద భావజాలాన్ని పెంచే విద్య మన సమాజానికి హాని జరిగేలా చేస్తుందని స్పష్టం చేశారు. సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, సంవత్సరాల తర్వాత బాల్యమిత్రులతో కలుసుకోవడం జీవితంలో మరిచిపోలేని అనుభూతిగా పేర్కొన్నారు. విద్యాబుద్ధులు నేర్పి తమ వ్యక్తిత్వ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన గురువులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీఎంఎస్) సుంకి రత్నాకర్, మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, పూర్వ విద్యార్థి పరిషత్ సభ్యులు సి. రాజిరెడ్డి, గుండం అశోక్ కుమార్, విభాగ్ కార్యదర్శి దహేగాం గోవిందరావు, జిల్లా కార్యదర్శి సూరం లక్ష్మీనారాయణ, పాఠశాల అధ్యక్షులు బందారు సూరిబాబు, కార్యదర్శి దాసరి రాములు, కమిటీ సభ్యులు బత్తుల సతీష్, అకాడమిక్ ఇంచార్జ్ పూదారి సత్యనారాయణ, పూర్వ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతీ ఒక్కరూ డిఫెన్సివ్ డ్రైవింగ్ తప్పనిసరిగా పాటించాలి

**ఎస్సై జి శ్రీనివాస్**

లక్ష్మణచాంద, నవంబర్ 16, ప్రభాతవార్త:




డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరూ డిఫెన్సివ్ డ్రైవింగ్ తప్పనిసరిగా పాటించాలని లక్ష్మణచాంద ఎస్సై జి శ్రీనివాస్ అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని పోట్టపెల్లి గ్రామంలో డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై జి శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్లపై ప్రయాణిస్తున్న వాహనదారులు డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాలు పాటించాలని అన్నారు. వాహనదారుల నిర్లక్ష్యం వల్ల సంభవించే ప్రమాదాల నుండి ఎలా కాపాడుకోవాలనే జాగ్రత్తల గురించి వివరించారు. తప్పు దారిలో వచ్చే డ్రైవింగ్ వాహనాలను ముందుగానే గుర్తించాలని, మొబైల్ ఉపయోగించే డ్రైవర్లకు దూరంగా ఉండాలని అన్నారు. ఎవరైనా రోడ్డు పక్కన పార్క్ చేసిన వాహనాల డోర్లు అకస్మాత్తుగా తెరిచినప్పుడు జాగ్రత్తల గురించి వివరించారు. సిగ్నల్ జంప్ చేసే వాహనాలను గమనించి తగుజాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎవరైనా వాహన దారులు ఆకస్మిక బ్రేకులు వేసినప్పుడు వారికి దూరంగా ఉండేందుకు అవసరమైన దూరం పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత చేప పిల్లల పంపిణి

జైపూర్, నవంబర్ 16, ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ ఆధ్వర్యంలో వంద శాతం రాయితీతో చేప పిల్లలను ఆదివారం మండలంలోని మత్స్య కారులకు ఉచితంగా పంపిణీ చేశారు. జైపూర్ మండలంలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఇందారం, కుందారం, బెజ్జాల, శెట్‌పల్లి, వేలాల, కాన్కూర్, జైపూర్ మండల గ్రామ పంచాయతీల పరిధిలోని మొత్తం 32 చెరువులలో 9.54 లక్షల (35-40 ఎం.ఎం) చేప పిల్లలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు రిక్కుల శ్రీనివాస రెడ్డి, వేముల రవి, శ్రీపతి బాపురావు, ఎంపీటీ, విడుగుల సాగర్, ఐదీ లింగన్న, కల్కి రమేష్, మత్స్య శాఖ అసిస్టెంట్ శ్రవణ్, మత్స్య శాఖ ఫీల్డ్ మెన్ రాజేష్, నీల రవితేజ, మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు బూతగడ్డ బాలయ్య, ఇండ్ల గోపాల్, రతే రాములు, ముతుకుల వెంకటేశం, పి. బాపు తదితరులు పాల్గొన్నారు.




# పత్తి కొనుగోళ్లు నిలిపివేత

## ఎల్1-ఎల్2-ఎల్3 నిబంధనలు సడలించే వరకు నిర్ణయం

**నిర్మల్ జిల్లా కాటన్ అసోసియేషన్**

సారంగపూర్, నవంబర్ 17, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర కాటన్ అసోసియేషన్ నిర్ణయం మేరకు, పత్తి జిన్నింగ్ మిల్లులకు సంబంధించి అమల్లో ఉన్న ఎల్1, ఎల్2, ఎల్3 నిబంధనలు సడలించేంత వరకు పత్తి కొనుగోళ్లు పూర్తిగా నిలిపివేస్తున్నట్లు నిర్మల్ జిల్లా పత్తి అసోసియేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని అసోసియేషన్ స్పష్టం చేసింది. భారత పత్తి సంస్థ (సిసిఐ) తీసుకున్న విధానాల నేపథ్యంలో, జిన్నింగ్ యూనిట్లు ఎదుర్కొంటున్న సమస్యలపై దీనికి సంబంధించిన సమ్మె, బంద్‌ను ప్రకటించినట్లు తెలిపారు. జిల్లా మార్కెట్ అధికారి గజనంద్ మాట్లాడుతూ సమస్య పరిష్కారం అయ్యే వరకు రైతులు జిల్లాలోని నోటిఫైడ్ జిన్నింగ్ కేంద్రాలకు పత్తి తీసుకురాకూడదని, అలాగే స్లాట్ బుకింగ్ చేయకుండా ఉండాలని సూచించారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని మార్కెట్లలో ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని తెలిపారు. రైతులు అనవసర ఇబ్బందులు పడకుండా ఈ నిర్ణయాన్ని గమనించి సహకరించాలని అధికారులు కోరారు.



# కంకలమ్మ జాతరలో ప్రవీణ్ కుమార్ ప్రత్యేక పూజలు

కౌటాల,నవంబర్ 16, ప్రభాతవార్త :

కౌటాలలోని ప్రముఖ శ్రీ కేతేశ్వర కంకలమ్మ దేవి జాతరలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిర్పూర్ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని తల్లిని ప్రార్థించిన ఆయన, రాష్ట్ర రైతుల కష్టాలు తప్పి పండించిన పంటకు మద్దతు ధర లభించాలని, రైతు ఆత్మహత్యలు నిలిచిపోవాలని కోరుకున్నారు. జాతరకు వచ్చిన భక్తుల కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత తాగునీటి పంపిణీ ఏర్పాటు చేసి సేవలు అందించారు. భక్తులతో కలిసి ప్రవీణ్ కుమార్ బోనం ఎత్తుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బసార్కర్ విశ్వనాథ్, రాంటెంకి నవీన్, కార్తీక్, సాయి, లలిత, మమత, తదితరులు పాల్గొన్నారు.

# ర్యాలీ, ధర్నాను విజయవంతం చేయాలి

ఉట్నూర్, నవంబర్ 16, ప్రభాతవార్త:

అటవీ ఉత్పత్తులపై, పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న జిల్లాలోని కొలాం కులస్తుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ కొలాం కులస్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొడప సోనేరావు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్లుగా గుడిసేలు వేసుకోని జీవనం కొనసాగిస్తున్న కొలాం కులస్తులు పక్కా ఇళ్లు నిర్మించుకున్నేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం జన్మన్ పథకం నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇంటి నిర్మాణాల కోసం ఉన్న గుడిసేలను తొలగించి ఇంటి నిర్మాణం కోసం కొలతలు వేసి ముగ్గులు సైతం అధికారులు వేయడం జరిగిందన్నారు. కానీ ఇంటి నిర్మాణాలను చేపట్టకుండా అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఉన్న ఇంటిని తొలగించకోవడంతో నివాసం ఉండేందుకు గుడిసే కూడా లేకపోవడంతో కొలాం కులస్తులు చలిలో చిన్న పిల్లలతో పాటు వృద్దులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంతో పాటు పీఎం జన్మన్ నిధులు పూర్తి స్థాయిలో విడుదల చేయాలన్నారు. పీఎం, సీసీడీపీ నిధులకు సంబంధించి అధికారులు శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. ఐటీడీఏలో ఖాళీగా ఉన్న పోస్టులను పీవీటీజీ నిరుద్యోగులతో భర్తీ చేయాలన్నారు. పోడు భూములకు అటవీ హక్కు విరాసత్ అయిన వారికి వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు జిల్లా అధికారులకు విన్నవించినా స్పందన లేకపోవడంతోనే ధర్నాకు పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమ్ర రాజు, కుంరం సూరు యువసేన జిల్లా ప్రధాన కార్యదర్శి టేకం భీము, వివిధ గ్రామాల పటేళ్లు ఆత్రం తుకారాం, మడావి రమేష్, కొడప లక్ష్మణ్, భీంరావ్, ఆత్రం నాగుబాయి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొడప సోనేరావు

# పేదలకు అండగా ప్రభుత్వం ఉంటుంది

**మంచిర్యాల డీసీసీ అధ్యక్షురాలు సురేఖ**

లక్సెట్టిపేట, నవంబర్ 16, ప్రభాతవార్త



పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని మంచిర్యాల డీసీసీ అధ్యక్షురాలు సురేఖ అన్నారు. లక్సెట్టిపేట మండలంలోని జెండావెంకపూర్ గ్రామానికి చెందిన లలిత ఆరోగ్య ఖర్చుల నిమిత్తం 2 లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసిని బాధితురాలి కుటుంబీకులకు అందజేశారు. ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సురేఖ అన్నారు.

# తెలంగాణ రాష్ట్ర గేయ రచయిత అందెశ్రీ పై పాట విడుదల

బెల్లంపల్లి, నవంబర్ 16, ప్రభాతవార్త



బెల్లంపల్లి పట్టణంలోని పల్లెటూరి బస్టాండ్ దగ్గర స్థానిక కాంటా ఏరియాలో ఆదివారం కవి, రచయిత తెలంగాణ రాష్ట్ర గేయ రచయిత స్వర్గీయ అందెశ్రీకి నివాళులర్పిస్తూ సుధమల్ల వెంకన్న రచించిన అందెశ్రీ పైన పాటను సుధమల్ల క్రియేషన్స్ యూట్యూబ్ ఛానల్ ద్వారా సుధమల్ల వెంకట్ రచయిత ఆధ్వర్యంలో విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి హనుమాండ్ల మధుకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అమురాజుల రాజేశ్వర్ అతిథులుగా టీఆర్‌జెకెఎస్ పట్టణ అధ్యక్షుడు దినేష్ కుమార్, సరగడ సంపత్ రెడ్డి, సీనియర్ కళాకారులు తోగరి శ్రీనివాస్, బొంకూరి రాంచందర్, మిట్టపల్లి మల్లేష్, పోతర్ల లింగయ్య, ఆరేపల్లి ఆనంద్, ఇనుముల రాయమల్లు, భీమ్ కుమార్, బొంకూరి రవి కుమార్, జిడిఆర్ పాల్గొన్నారు.

# హలో మాల చలో హైదరాబాద్

**మాలల రణభేరి మహాసభను జయప్రదం చేయండి**
**మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు పిలుపు**



**బెల్లంపల్లి, నవంబర్ 16, ప్రభాతవార్త**

మాల మహానాడు మంచిర్యాల జిల్లా అధ్యక్షులు కుంబాల రాజేష్ అధ్యక్షతన, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్ట మధుకర్, రాష్ట్ర అధికార ప్రతినిధి భూపెల్లి మల్లన్న ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ నవంబర్ 23న సరూర్ నగర్ స్టేడియం గ్రౌండ్‌లో జరప తలపెట్టిన మాలల రణభేరి మహాసభను విజయవంతం చేయుటకు మాలలంతా తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ మహాసభలో మాలలకు ఎస్సీ వర్గీకరణ అనంతరం జరిగిన రోస్టర్ పాయింట్ల కేటాయింపులో 5 శాతం కేటాయించిన గ్రూప్ 3 లోని మాలలకు 1 శాతం ఉన్న గ్రూప్ 1 లోని కులాల కంటే విద్యా, ఉద్యోగాలలో తక్కువ అవకాశాలు వస్తున్నాయని మనకు జరిగిన ఈ అన్యాయంపై ప్రశ్నించడంతో పాటు ఎస్సీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ శాతాన్ని పెంచడం ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరి చేయడం తోపాటు,మాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వెయ్యికోట్ల నిధుల కేటాయింపు డిమాండ్‌తో పాటు మాలల సామాజిక భవనంఏర్పాటు తదితర డిమాండ్ల సాధనకై ప్రభుత్వాన్ని ప్రశ్నించ నున్నట్లువారు పేర్కొన్నారు. ఈ సమావేశంలోమాల మహానాడు మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రాజేష్, మధుకర్, మల్లన్న, జాతీయ ఉపాధ్యక్షులు దమ్మ నారాయణ, మద్దెల తిరుమల మాట్లాడిన అనంతరం కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది. వారు మాట్లాడుతూ మండలాల వారీగా తిరిగి మాలలను చైతన్యం చేసి అధిక సంఖ్యలో మాలల రణభేరి మహాసభకు జిల్లా నుంచి తరలి వస్తామని వారు పేర్కొన్నారు.

# గ్రంధాలయలు విజ్ఞాన బాండగారాలు



**ఆసిఫాబాద్, నవంబర్ 16, ప్రభాతవార్త:**

భాష,సాహిత్యం,సాంస్కృతికం భావితరాలకు దారులు చూపే విజ్ఞాన బాండగారాలు గ్రంథాలయాలు అని విశ్రాంత పరీక్షల సహాయ కమిషనర్ మర్యాల ఉదయ్ బాబు అన్నారు, 58వ గ్రంధాలయా వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం జిల్లా గ్రంధాలయంలో కవి సమ్మేళనం, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనంతో మేధా శక్తిని, విజ్ఞానాన్ని పెంపొందించవచ్చుని, విద్యార్థి దశనుంచే పుస్తక పఠనం చేయాలని అన్నారు. నేటి విద్యార్థులు మాత్రం యువకులు సెల్ ఫోన్ మోజులో పుస్తకాన్ని విస్మరిస్తున్నారన్నారు. వ్యాసరచన పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ధర్మపురి వెంకటేశ్వర్లు రాజ్ కుమార్ లు న్యాయ నిర్నేతలుగా వ్యవహరించారు. ఈ కవి సమ్మేళనంలో ఆసిఫాబాద్ కు చెందిన కవులు గుర్రాల వెంకటేశ్వర్లు, ధర్మపురి వెంకటేశ్వర్లు, చిలుకూరి రాధాకృష్ణ చారి, కిల్లి వెంకటరావ్, ప్రశాంత్, మాసాదే నాగోరావ్, జాడి పెంటయ్యా, మహమ్మద్ ఇషాక్, హుస్సేన్, తాటిపల్లి జ్యోతి, భోగ స్వప్న, వీరపనేని త్రివేణి, కవిత వినిపించిన పాఠనలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో గ్రంధాల యధికారులు కుర్సెంగ ప్రవీణ, యం స్వర్ణలత, టి సదానందం, రికార్డ్ అసిస్టెంట్ జి సతీదేవి, సిబ్బంది సలీం, రామయ్యా, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భారతీయ మజ్దూర్ సంఘ్

# నూతన జిల్లా అడక్ కార్యవర్గం ఎన్నిక



**కాగజ్‌నగర్ రూరల్,నవంబర్ 16, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ పట్టణంలోని భారతీయ మజ్దూర్ సంఘ్ కార్యాలయంలో మజ్దూర్ సంఘ రాష్ట్ర సంఘటన కార్యదర్శి రామ్మోహన్,బిఎంఎస్ జాతీయ కమిటీ సభ్యులు కల్లోల్ల భట్టాచార్య ఆధ్వర్యంలో ఆదివారం నూతన జిల్లా అడక్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మోరెలే నానాజీ, జిల్లా కార్యదర్శిగా చౌహాన్ సంతోష్,ఉపధ్యక్షులుగా రామగిరి సతీష్,సహా కార్యదర్శిగా రమ్మిల సత్యనారాయణ, కోశాధికారిగా గోలి మల్లేష్‌లను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా బిఎంఎస్ అధ్యక్షులు కుంతల శంకర్,కార్యదర్శి మద్దూరి రాజు యాదవ్,లగిశెట్టి కమలాకర్,కశెట్టి నాగేశ్వరరావు,నగరం గణపతి, ఎస్పిఎం బిఎంఎస్ జనరల్ సెక్రెటరీ సి.వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామ శంకర్ సింగ్, జాయింట్ సెక్రెటరీ అరుణ్,ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్ అన్నం రాజన్న పాల్గొన్నారు.



పట్టుకున్న వాహనంతో ఎస్సై, పోలీస్ సిబ్బంది

# అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

**వేమనపల్లి, నవంబర్ 16, ప్రభాతవార్త**

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్న ఘటన ఆదివారం నీల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం మంగనపల్లి క్రాస్ రోడ్డు వద్ద తమ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా సుమారుగా మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో వేమనపల్లి నుండి ఏపీ 28 టీసీ 8450 నంబర్ గల టాటా ఏస్ వాహనం అనుమానస్పదంగా ఉండటంతో అట్టి వాహన ఆపి తనిఖీ చేయగా అందులో సుమారు 7 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్టు గుర్తించామని అన్నారు. డ్రైవర్ ను విచారించగా తనది మంచిర్యాల ఎన్టీఆర్ నగర్ అని, అట్టి బియ్యం సిరోంచకు తరలిస్తున్నట్లు ఒప్పుకోవడంతో వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కి తరలించి, డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.




వందేమాతర గీతాలాప చేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

# వందేమాతర గీతం 150 ఏళ్ల సందర్భంగా కాగజ్‌నగర్‌లో సామూహిక గీతాలాప

**కాగజ్‌నగర్ ,నవంబర్ 16, ప్రభాతవార్త :**

వందేమాతర గీతం ప్రచురించి 150 సంవత్సరాలు పూర్తయిన వేళ కాగజ్‌నగర్ పట్టణంలో భవ్యంగా సామూహిక వందేమాతర గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని మార్కెట్ ఏరియాలో వ్యాపారస్తులు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొని మానవహారంగా నిలబడి ఒక్క స్వరంతో వందేమాతర గీతం ఆలపించారు. ఈ సందర్భంగా సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతర నినాదం ప్రజల్లో అగ్ని జ్వాలను రగుల్చిందని, బ్రిటిష్ ప్రభుత్వాన్ని వణికించిందని గుర్తుచేశారు. ప్రతి భారతీయుడు ఈ గీతాన్ని హృదయంలో దాచుకుని దేశ పురోగతికి తమ వంతు బాధ్యతగా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, మాజీ జిల్లా అధ్యక్షులు డా. కొత్తపల్లి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు ఆర్మీ శివ, మండల అధ్యక్షులు పుల్ల అశోక్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణ

**తాండూర్, నవంబర్ 16, ప్రభాతవార్త :**

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట్ స్వామి నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బిజెపి నాయకులు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని తాండూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండి ఈసా,మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ అన్నారు. తాండూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు,ఇందిరమ్మ ఇళ్ళు కేటాయింపు,మంజూరులో ఎమ్మెల్యే అనుచరులు అక్రమాలకు పాల్పడుతున్నరని బిజెపి నాయకులు ఆరోపణలు చేయడం అసత్యమన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం కోట్లాది రూపాయల మంజూరు చేస్తూ ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాడని అన్నారు. ఎమ్మెల్యే పై,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై బీజేపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హితవు పలికారు. సమావేశంలో నాయకులు సుందిళ్ల భూమయ్య, మాసాడి తిరుపతి, విష్ణు, శివ పాల్గొన్నారు.

# ఈస్గాం శివాలయంలో
# భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

**కాగజ్‌నగర్ రూరల్, నవంబర్ 16, ప్రభాతవార్త :**

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ మండలం ఈస్గాంలో గ్రామంలో కొలువైన శ్రీ శివమల్లన్న స్వామి దేవాలయంలో ఆదివారం కార్తీక బహుళ ద్వాదశి సందర్భంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో జంటలు వ్రతంలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకొని ఆశీస్సులు పొందారు. అర్చకులు సంతోష్ శర్మ వేదమంత్రాల నడుమ సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. భక్తులు పూజా ద్రవ్యాలను తెచ్చుకొని, అత్యంత భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. ఈ సామూహిక వ్రతంలో 14 జంటలు తమ కుటుంబ సభ్యులతో సహా వేదికపై ఆసీనులై, పవిత్రమైన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజ అనంతరం భక్తులందరూ స్వామివారికి పండ్లు, పాయసం నైవేద్యాలను సమర్పించారు. అనంతరం అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి గర్రెపల్లి వేణుగోపాల్ గుప్తా, ఆలయ ఉత్సవ కమిటి చైర్మన్ మైలారపు మురళీధర్, అర్చకులు, ఆలయ ఉత్సవ కమిటి సభ్యులు, సిబ్బంది పిఎవి శ్రీనివాసచారి భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



సామూహిక సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న జంటలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ కార్యనిర్వహణాధికారి గర్రెపల్లి వేణుగోపాల్ గుప్తా

# బీసీ రిజర్వేషన్‌ని తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాలి

**ఆసిఫాబాద్, నవంబర్ 16, ప్రభాతవార్త :**

కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసి బిసి రిజర్వేషన్లు 9 షెడ్యూల్లో చేర్చాలని కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జేఏసీ చైర్మన్ రూపున రమేష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర జేఏసీ ఇచ్చిన అష్టాంగ కార్యక్రమాల పిలుపులో భాగంగా రన్ ఫర్ సోషల్ జస్టిస్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ అజ్మీర్ శ్యామ్ నాయక్ తో కలిసి ప్రారంభించారు ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి కొమరం భీం చౌక్ మీదుగా జనకాపుర్ వరకు రన్ నిర్వహించారు అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ప్రధానమంత్రి వద్దకు తీసుకెళ్లి రాజ్యాంగంలో తొమ్మిదో షెడ్యూల్లో చేర్చే విధంగా ఒత్తిడి తీసుకోవాలని అన్నారు. రిజర్వేషన్ సాధించే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని, రానున్న రోజుల్లో ఉద్యమాన్ని ఉద్రతం చేస్తామన్నారు ఈ కార్యక్రమం లో బీసీ జేఏసీ జిల్లా కోఆర్డినేటర్ ఆవిడపు ప్రణయ్, బీసీ సంక్షేమ సంఘం ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు సిరికొండ సాయికృష్ణ, బీసీ యువజన సంగం ఆసిఫాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు బొట్టుపల్లి ప్రశాంత్, నాయకులు పొన్నాల నారాయణ, యువకులు పాల్గొన్నారు.



అంబెడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ రూపునర్ రమేష్

# ట్రాలీ డ్రైవర్ అదృశ్యం
## పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు

**మందమర్రి, నవంబర్ 16, ప్రభాతవార్త**

మందమర్రి పోలీసులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన ట్రాలీ డ్రైవర్ అదృశ్యమైపోవడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. అదృశ్యమైన వ్యక్తి దేవి చంద్రయ్య (61) ఊరు మందమర్రి నివాసిగా పోలీసులు గుర్తించారు. పూర్తి వివరాల్లోకి వెళితే... ఈనెల 13న మధ్యాహ్నం సమయంలో ఊరు మందమర్రికి చెందిన దేవి చంద్రయ్య (61), డ్రైవర్‌గా పనిచేస్తూ తన ఏపీఈ ట్రాలీతో మందమర్రి బస్టాండ్ నుండి మేడారం వైపు రాంగ్ రూట్‌లో వెళ్తున్నాడు. ఈ సమయంలో మేడారం నుండి సరైన మార్గంలో వస్తున్న గ్లామర్ మోటార్ సైకిల్‌ను ట్రాలీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొక్కల గుట్టకు చెందిన వొళ్ళపు నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం తరువాత డ్రైవర్ అదృశ్యం అయ్యాడు. ప్రమాదం జరిగిన వెంటనే ట్రాలీ ఆపకుండా వెళ్లిపోవడంతో, కొంతదూరం వెళ్లి ఆటోను వదిలేసి డ్రైవర్ చంద్రయ్య అదృశ్యమయ్యాడు. ఆయనను అప్పటి నుండి ఎవరూ కనిపించలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆయన భార్య దేవి భూలక్ష్మి మందమర్రి పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. దేవి చంద్రయ్య ఆచూకీ తెలిసిన వారు ఎవరు అయినా వెంటనే మందమర్రి పోలీసులకు 8712656570 నెంబర్‌లో సమాచారమివ్వాలని కోరారు.

# సమాజంలో మీడియా పాత్ర కీలకం
## బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్
## సీనియర్ జర్నలిస్టులకు సన్మానం

**అసిఫాబాద్, నవంబర్ 16, ప్రభాతవార్త:**

సమాజంలో మీడియా పాత్ర కీలకం అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రుప్నర్ రమేష్ అన్నారు. జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా ఆదివారం బీసీ సంఘం కార్యాలయంలో సాయంత్రం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టియుడబ్ల్యూజే ఐజేయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్ లకు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవ స్పృహతో జర్నలిస్టులు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తూ అనేక సేవలు అందిస్తున్నారన్నారు. ప్రజా సమస్యల పై అనేక కథనాలు రాస్తూ సమస్యలు పరిష్కారం కోసం పాత్రికేయులు కృషి చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వైరాగాడే మారుతి పటేల్ , బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్, ఆర్ ఎం పి వైద్యుల మండల అధ్యక్షుడు పొన్నాల నారాయణ, బీసీ సంఘం ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు సిరికొండ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ జర్నలిస్టులను సన్మానిస్తున్న దృశ్యం

# జాతీయ యువజన ఉత్సవాలకు జిల్లా స్థాయి యువజన కళాకారుల ఎంపిక

**ఆసిఫాబాద్, నవంబర్ 16, ప్రభాతవార్త :**

జాతీయ యువజన ఉత్సవాలను పురస్కరించుకొని కుమురం భీం జిల్లా స్థాయి యువజన కళాకారుల ఎంపికను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న జిల్లా కేంద్రం లోని ఆదివాసీ భవన్ లో ఉదయం 11 గంటలకు నిర్వహించబడుతుందన్నారు. ఈ పోటీలలో పాల్గొనే అభ్యర్థుల వయస్సు 15 నుండి 29 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారికి రాష్ట్ర స్థాయి యువజన ఉత్సవాలకు పంపించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారిని వచ్చే ఏడాది జనవరి 10 నుండి 12 వరకు న్యూ ఢిల్లీలో జాతీయ స్థాయిలో జరిగే యువజన ఉత్సవాలకు పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా స్థాయి యువజన ఉత్సవాలలో పాల్గొనేవారు వారి వివరాలను జిల్లా యువజన, క్రీడల కార్యాలయము అందజేయాలని, వాట్సాప్ నంబర్ 8247096710 ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 8247096710, 7330733413 కి సంప్రదించవచ్చున్నారు.